క్లుప్తంగా

ఆలయ నిర్మాణానికి రూ. 50 వేల విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న అప్పారావు

పరవాడ: జీవీఎంసీ 88 వార్డు సంగినారపాడు కొత్తూరులో శ్రీ దుర్గమాంబ ఆలయ నిర్మాణానికి పెదముషిడివాడ సర్పంచ్ పల్లా నాగమణి తనయుడు పల్లా అప్పారావు (కబడ్డీ) రూ.50 వేల విరాళాన్ని బుధవారం అందజేశారు. ఆలయ నిర్మాణానికి విరాళం అందజేసిన అప్పారావు కుటుంబాన్ని శ్రీదుర్గమాంబ చల్లగా చూడాలని ఆలయ కమిటీ సభ్యులు ఆకాంక్షించారు.

అప్పన్న సన్నిధిలో ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని బుధవారం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించి వేద ఆశీర్వచనం ఇచ్చారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని ఏఈవో నరసింహరాజు ఆయనకు అందజేశారు.

పంచాయతీలకు శానిటేషన్ సామగ్రి అందజేత



సామగ్రితో ఎంపీడీవో వెంకటరావు తదితరులు

సింహాచలం: మనం మన పరిశుభ్రతలో భాగంగా పెందుర్తి మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు శానిటేషన్ సామగ్రిని బుధవారం ఎంపీడీవో కె.వెంకటరావు అందజేశారు. మండలంలోని గవరపాలెం పంచాయతీకి ఒక పరికరం అందజేశారు. అలాగే చింతలగ్రహారం, జెర్రిపోతులపాలెం, ముదపాక, వాలిమెరక గ్రామ పంచాయతీలకు హైప్రెజర్ టాయిలెట్ క్లీనర్స్, గవరపాలెం, చింతలగ్రహారం, జెర్రిపోతులపాలెం, జంగాలపాలెం, ముదపాక గ్రామ పంచాయతీలకు ఫాగింగ్ పరికరాలు అందజేశారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ ఎస్.అప్పారావు, పంచాయతీల సెక్రటరీలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రి హోమం

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురి కాలనీలోని సీతారామాలయ ఉపాలయ వార్షికోత్సవాల్లో భాగంగా బుధవారం గాయత్రీదేవికి పంచామృతాభిషేకం చేశారు.అలాగే ఆలయ ప్రాంగణంలో గాయత్రి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు విశేషంగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు సీవీఆర్ మూర్తి, చలపతిరావు, అప్పలనాయుడు, రామారావు తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మహాభారతంపై సాహిత్య ప్రసంగం

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ప్రిజమ్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో మహాభారతంలో విశేషాంశాలు అనే అంశంపై సాహితీవేత్త టీపీఎస్ ఆచార్యులు ప్రసంగించారు. ముందుగా వ్యాసుని జన్మవృత్తాంతం.. ఆపై సహస్ర కవచ రాక్షసుడితో నరనారాయణుల యుద్ధం, ఒక్క కవచంతో సూర్యుడి శరణు వేడుట అతడే కర్ణుడిగా జన్మించడం, వాని సంహారానికి నర నారాయణులు కృష్ణార్జునులుగా పుట్టారని తెలిపారు. సభాధ్యక్షుడు శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ మహాభారతంలో ఎన్నో ధర్మ సూత్రాలు, జీవిత సత్యాలు నిక్షిప్తమై ఉన్నాయన్నారు. మహాభారతం నేటికీ మనందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. సాహితీవేత్తలు కె.జి.వేణు, డి.వి.సూర్యారావు, పరవస్తు ఫణిశయనసూరి, చిన సూర్యనారాయణ, భాగవతుల సత్యనారాయణమూర్తి చర్చించారు.

పేదింట క్రీడా కుసుమం

- దక్షిణాసియా పోటీల్లో సత్తా
- ఆసియా స్థాయి పోటీలకు ఎంపిక



జ్ఞానేంద్ర



విజేతగా నిలిచిన జ్ఞానేంద్రను అభినందిస్తున్న నిర్వాహకులు

సబ్బవరం: కశ్మీరీలు సృష్టించిన దక్షిణాసియా యుద్ధ కళ(స్కే)లో సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సత్తా చూపాడు. స్కే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్, శిక్షకుడు ఎం. త్రినాథరావు ఆధ్వర్యంలో శిక్షణ పొందుతూ రాటు దేలాడు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు కొల్లగొడుతున్నాడు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకూ నేపాల్ రాజధాని ఖాట్మండులో నిర్వహించిన 7వ స్కే దక్షిణ ఆసియా చాంపియన్ షిప్-2023 పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు.అండర్-11 విభాగంలో పాఠశాలలో 6వ తరగతి చదువుతున్న ఉరిగిటి జ్ఞానేంద్ర రజత పతకం సాధించాడు. త్వరలో ఆసియా స్థాయిలో మలేషియాలో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించాడు.

పట్టుదలతో పైపైకి..

జ్ఞానేంద్ర స్వగ్రామం పెందుర్తిలోని రెల్లికాలనీ. కాగా తండ్రి శ్రీనివాసరావు మార్బుల్ వర్క్ చేస్తుంటారు. దీంతో వృత్తి రీత్యా సబ్బవరం పరిసర ప్రాంతాల్లో పనులు చేసుకుంటూ సబ్బవరంలోని గోపాల్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. లేబర్ పనులు చేసుకుంటూనే కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు.తల్లి అరుణ గృహిణి. జ్ఞానేంద్ర పేదింటి బిడ్డ అయినా అభిరుచికి అనుగుణంగా ప్రోత్సహించడంతో ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్నాడు.

జిల్లా నుంచి జాతీయ స్థాయికి

ఈ పోటీలకు జిల్లా స్థాయిలో ఎంట్రీలు ఆహ్వానించి ఎంపికలు చేపట్టారు. రాష్ట్ర స్థాయి పోటీలను రాజమండ్రిలోని రావులపాలెంలో నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రతిభ చూపి బంగారు పతకం సాధించాడు. జాతీయ స్థాయి పోటీలు జమ్మూకశ్మీర్‌లో నిర్వహించగా అక్కడ కాంస్యపతకం సాధించాడు.

ఎంపిక ఇలా..

ఈ పోటీలను అండర్-11,అండర్-14, అండర్-16, అండర్-18 కేటగిరిలో స్త్రీ,పురుషుల విభాగాల్లో నిర్వహించనున్నారు. అదేవిధంగా వెయిట్‌కు సంబంధించి అండర్-25, 30, 35, 40 ....60 కిలోల విభాగంలో నిర్వహిస్తారు.ప్రతి కేటగిరీ నుంచి తర్వాత స్థాయిలో నిర్వహించే పోటీలకు ముగ్గురిని ఎంపిక చేస్తారు.

ప్రోత్సహించడంతో..



జ్ఞానేంద్ర ఫిట్‌నెస్‌కు సంబంధించిన శిక్షణ నేను అందిస్తున్నాను.పోటీలకు అవసరమయ్యే శిక్షణను కొత్తవలసకు చెందిన ఎం. త్రినాథరావు అనే వ్యక్తి వద్ద తర్ఫీదు పొందుతున్నాడు. సౌత్ ఆసియా స్థాయి పోటీల్లో భాగంగా ఖాట్మండ్ వెళ్లేందుకు రూ.35 వేలు ఆ కుటుంబం పెట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో పాఠశాలలోని ఉపాధ్యాయులు అంతా కలిసి కొంత సాయం అందించాం. మిగిలిన మొత్తం జ్ఞానేంద్ర తండ్రి పెట్టుకుని పోటీలకు పంపించారు.

– అబ్దుల్ రెహమాన్,
పీడీ,సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల

సింహాచలేశుడికి ఘనంగా ఆర్జిత సేవలు



గరుడసేవ నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు



అప్పన్న ఉత్సవమూర్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు అక్షింతలు, శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

ఘనంగా గరుడసేవ

సింహాచలేశుడికి బుధవారం ఘరుడసేవ ఘనంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని గరుడవాహనంపై అధిష్టంపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ చేసి భక్తులను గరుడ వాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

విశేషంగా సహస్రనామార్చన

వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం సహస్రనామార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులకు 1001 నామాలతో పూజ చేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు తులసి ప్రసాదం అందజేశారు.

నూతన నియామకం



ఉమామహేశ్వరరావుకు నియామకపత్రం అందజేస్తున్న కొణతాల శ్రీనివాస్, సభ్యులు

డాబాగార్డెన్స్: ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన కులాల సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర కోశాధికారిగా ప్రముఖ విద్యాసంస్థల అధినేత ఎం. ఉమామహేశ్వరరావు నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొణతాల శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నియామక పత్రం అందజేశారు. అనంతరం ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ బాధ్యతతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘం పేరిట త్వరలోనే వృద్ధాశ్రమం నిర్మించే ఆలోచనలో ఉన్నామని, అందుకు సంఘం కోర్ కమిటీ నిర్ణయం తీసుకుందన్నారు. అసోసియేషన్ ప్రతినిధులు ఆలేటి హేమలత, కోటా రమేష్, ఆర్‌వీ గోవిందరావు నాయుడు, సీహెచ్ వెంకటేశ్వరరావు, కొయ్య రామకృష్ణ, కొణతాల రాధ పాల్గొన్నారు.

మహాశివుడికి విశేష పూజలు



మహాశివుడి విగ్రహం ప్రారంభించి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బండారు

సబ్బవరం: మండలంలోని పైడివాడ అగ్రహారం గ్రామంలోని శ్రీకనకదుర్గమ్మ ఆలయం వద్ద నిర్మించిన మహాశివుడి విగ్రహాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంతం అంతా ఆధ్యాత్మిక భావన, ప్రశాంతత కలిగి ఉండేలా అమ్మవారి చల్లని దీవెనలు ఉండాలని ఆకాంక్షించారు. విగ్రహాన్ని మాజీ సర్పంచ్ దాసరి వెంకటరమణ ఆర్థిక సాయంతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గండి రవి,మాజీ సర్పంచ్‌లు దాసరి వెంకట రమణ,బొబ్బరి కన్నారావు,ఎంపీటీసీ సీరం అప్పలరాజు పాల్గొన్నారు.

ఎర్నిమాంబ ఆలయంలో..

సింహాచలం: జీవీఎంసీ 97వ వార్డు చినముషిడివాడ దరి గాంధీనగర్‌లోని ఎర్నిమాంబ ఆలయంలో విగ్రహ ప్రతిష్ట పూజలు బుధవారం ఘనంగా జరిగాయి. అధివాస పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూజల్లో మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి, 97వ వార్డు టీడీపీ నాయకులు శానాపతి శంకరరావు, దాట్ల మధు, కాలనీ నిర్వాసితులు పాల్గొన్నారు. గురువారం విగ్రహ ప్రతిష్ట విశేషంగా నిర్వహించనున్నారు.

ఉద్యోగం సాధించడం ఒక వరం



క్యాంపస్ ఉద్యోగార్థుల తల్లిదండ్రుల సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వెంకటరమణ

మురళీనగర్: డిప్లమో స్థాయిలో పాలిటెక్నిక్ విద్యార్థులు ఉద్యోగం సాధించడం వరమని, దీన్ని సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అన్నారు. బెంగళూరుకు చెందిన నెట్టూర్ టెక్నికల్ ట్రైనింగ్ ఫౌండేషన్(ఎన్‌టీటీఎఫ్) ఇటీవల నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఈ కళాశాల నుంచి 13 మంది బాలికలు ఉద్యోగాలు పొందారు. ఈ నేపథ్యంలో వీరి తల్లిదండ్రులు, కంపెనీ ప్రతినిధులతో బుధవారం ఏర్పాటు చేసిన ఇంటరాక్టివ్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా ఉద్యోగులకు కంపెనీలో పూర్తి రక్షణ ఉంటుందని వివరించారు. బాలికల తల్లిదండ్రులు అడిగిన పలు సందేహాలను ఎన్‌టీటీఎఫ్ ప్రతినిధులు నివృత్తి చేశారు. ఉద్యోగంలో చేరిన వారందరికీ రెండు నెలలు శిక్షణ ఇస్తామన్నారు. ఇందులో భాగంగా సాంకేతిక నైపుణ్యాలు, సాఫ్ట్ స్కిల్స్, సేఫ్టీ, సమగ్ర అభివృద్ధి వంటి అంశాల్లో శిక్షణ ఉంటుందని, అభ్యర్థులు శ్రీపెరంబదూర్‌లోని ఫస్ట్ సోలార్ కంపెనీలో పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. అమెరికా, మలేసియా, వియత్నాం వంటి దేశాల్లోని ఫస్ట్ సోలార్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో కంపెనీ స్కిల్ డెవలప్‌మెంట్ విభాగం మేనేజర్ సీపీ రమేష్ బాబు, సీనియర్ ఆఫీసర్ ఎస్.గీత, మెయింటెనెన్స్ ఇంజినీర్ బి.సాహల్ ఇబ్రహీం, హెఆర్ విభాగం ప్రతినిధులు దియానా సీక్వీరా, నిర్మలా దేవి, నివేదా, కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ వివిధ విభాగాల హెడ్‌లు డాక్టర్ బీవీ లక్ష్మణరావు, డాక్టర్ ఎస్. ప్రశాంతకుమారి, డి.దామోదర్, టీపీవో సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, ఏటీపీవో కుమార్ పాల్గొన్నారు.


స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే లక్ష్యం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్ ప్లాంట్ కార్మికులు , ఉక్కు నిర్వాసితుల జీవితాలను అయోమయంలోకి నెడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు పావులు కదుపుతున్న కేంద్ర ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెబుతారని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణే లక్ష్యంగా, ప్రజల భాగస్వామ్యంతో ఉక్కు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 734వ రోజు, బుధవారం ఎం.ఎం.ఎస్.ఎం, ఎస్టీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి దేముడు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కార్మికులు అహోరాత్రులు శ్రమించి స్టీల్‌ప్లాంట్ ఆస్తులను పెంచారని, అటువంటి పరిశ్రమను ప్రైవేట్ వ్యక్తులకు అమ్మేయాలని అనుకోవడం దుర్మార్గమని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రజల సంపద అని పేర్కొన్నారు. కార్మికుల హక్కులు, సదుపాయాలు కొనసాగాలంటే స్టీల్‌ప్లాంట్ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలన్నారు. అందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డి.రమేష్, ఎం.కె.వి.రాజేశ్వరరావు, జి.ఆనంద్, టి.ఎం.మోహన్‌కుమార్, వర్మ, జి.వి.రమణారావు, కె.ఆర్.కె.రాజు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

స్టీల్ ఓబీసీ నూతన కమిటీ బాధ్యతల స్వీకరణ



నూతన కమిటీకి పత్రం అందజేస్తున్న హెచ్‌ఆర్ ఉన్నతాధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంఘం నూతన కమిటీ బుధవారం బాధ్యతలు స్వీకరించింది. ఇటీవల జరిగిన సంఘం ఎన్నికల్లో నూతన కమిటీ గెలుపొందిన విషయం తెలిసిందే. స్టీల్ ప్లాంట్ ఎల్‌డీసీ ఆడిటోరియంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమానికి స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ సీజీఎం కె. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరు కాగా హెచ్‌ఆర్ జీఎం కె. సంజీవరావు, లైజన్ ఆఫీసర్ జి. అప్పారావు, ఎన్నికల అధికారి జె.వి. రావు విశిష్ట అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీజీఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓబీసీ సంఘానికి యాజమాన్యం తమ వంతు సహకారం అందిస్తుందన్నారు. నూతన కమిటీకి హెచ్‌ఆర్ ఉన్నతాధికారులు పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఓబీసీ సంఘం నూతన కమిటీ ప్రతినిధులు బి.అప్పారావు, యు. శ్రీనివాస్, కోయిలాడ శ్రీనివాస్ పాల్గొన్నారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

- పోలీసుల అదుపులో ముగ్గురు వ్యక్తులు



స్వాధీనం చేసుకున్న గంజాయి, నగదు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ముగ్గురిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. వారు తెలిపిన వివరాలిలా.. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రైల్వే స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ వద్ద గంజాయి రవాణా జరుగుతోందనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అనుమానాస్పద వ్యక్తుల వద్ద సోదాలు చేశారు. ముగ్గురు వ్యక్తుల నుంచి 10 కిలోల గంజాయితోపాటు రూ.1,500 స్వాధీనం చేసుకుని ఫోర్త్‌టౌన్ పోలీసులకు అప్పగించారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ త్రినాథరావు మాట్లాడుతూ నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ ఆదేశాల మేరకు స్పెషల్ బ్రాంచ్ అడిషనల్ కమిషనర్ గంగాధర్ పర్యవేక్షణలో సోదాలు చేశామన్నారు. కేరళ తిరువనంతపూర్‌కు చెందిన సురేష్‌కుమార్, అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట బొడ్డపుట్టుకు చెందిన మజ్జి బాలకృష్ణ, మజ్జి అరుణలను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

అంకిత భావంతో పనిచేయండి

గృహసారథులు, సచివాలయ కన్వీనర్లకు ఎమ్మెల్యే అదీప్‌రాజ్ సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: రాష్ట్రం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లే బాధ్యత గృహసారథులు,సచివాలయ కన్వీనర్లపై ఉందని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. పెందుర్తి మండలం రాంపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్ల కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందించారన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికీ పార్టీలతో సంబంధ లేకుండా పథకాలు అందించామన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని, సంక్షేమ పథకాల వివరాలను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లే బాధ్యత గృహసారథులు, కన్వీనర్లపై ఉందన్నారు. ప్రతీ ఒక్కరూ అంకింత భావంతో పనిచేయాలని సూచించారు. పార్టీ నాయకులు వారికి అండగా నిలవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, ఎంపీపీ మధుపాడ నాగమణి, రాష్ట్ర నాయకులు భగవాన్ జయరామ్, మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు, రాంపురం సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష తదితరులు పాల్గొన్నారు.

మోతాదుకు మించి పురుగు మందులు వాడితే చేటు

- ఏవో సీహెచ్ చంద్రావతి
- పరవాడలో 'వైఎస్సార్ పొలం బడి' నిర్వహణ



పరవాడలో క్షేత్ర పరిశీలన చేస్తున్న వ్యవసాయాధికారులు

పరవాడ: మిత్ర, శత్రు పురుగుల నిష్పత్తిని గమనిస్తూ అవసరమైన మేరకు మాత్రమే పురుగు మందులు పిచికారీ చేయాలని మండల వ్యవసాయాధికారి సీహెచ్. చంద్రావతి చెప్పారు. జిల్లా వనరుల కేంద్రం(డీఆర్‌సీ), మండల వ్యవసాయశాఖ సంయుక్తంగా పరవాడలో బుధవారం వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. వరిలో ఆకుముడత, కాండం తొలుచు పురుగులను నివారించేందుకు రైతులకు ట్రైకార్డులు అందజేస్తామన్నారు. నత్రజని, భాస్వరం,పొటాషియంకు సంబంధించి సేంద్రియ ఎరువులు వాడే విధానాన్ని వివరించారు. అనంతరం రైతులతో సేంద్రియ ఎరువులు తయారు చేయించారు. పలు క్షేత్రాలను పరిశీలించి జింక్ లోపం ఉన్నట్టు గుర్తించారు. దీని నివారణ కోసం ఎకరానికి 400 గ్రాముల జింక్ సల్ఫేట్ పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. వారం వ్యవధిలో రెండు పర్యాయాలు ఇలా చేస్తే జింక్ లోపాన్ని పూర్తిగా నివారించే అవకాశం ఉందని ఏవో చంద్రావతి రైతులకు సూచించారు. కార్యక్రమంలో డీఆర్సీ అధికారి విజేత, ఏఈవో ఎం.ఎస్.మూర్తి, వీఏఏ గౌతమి, రైతులు సిరపరపు సన్యాసినాయుడు, చుక్క అప్పలనాయుడు, లాలం సురేష్, పైల రామునాయుడు, పెదప్పారావు, సిరపరపు సన్నిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న రాంకీ ఎండీ డాక్టర్ లాల్‌కృష్ణ

పరవాడ: స్థానిక జేసాప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశాఖ ఫార్మాసిటీ, రాంకీ ఫౌండేషన్ సౌజన్యంతో రొంగలి కారునాయుడు మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌ను రాంకీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.పి.లాల్‌కృష్ణ బుధవారం ఫార్మాసిటీ క్రీడా మైదానంలో ప్రారంభించారు. అంతక ముందు దివంగత కారునాయుడు, జేశాప్ వ్యవస్థాపక అధ్యక్షుడు సోడిశెట్టి దుర్గారావుల చిత్ర పటాలకు నివాళులర్పించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అలాగే దివంగత జర్నలిస్ట్ కారునాయుడు సతీమణికి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఫార్మాసిటీ డీజీఎం గిరిధర్‌భక్తి, రాంకీ ఫౌండేషన్ ప్రతినిధి శ్రీకాంత్, వసుధ, విష్ణు, రక్షిత్ పరిశ్రమల ప్రతినిధులు హర్ష, కమలాకర్, దొర, జేసాప్ ప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ టోర్నీ



టాస్ వేసి క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభిస్తున్న అన్నంరెడ్డి అజయ్‌రాజ్

సబ్బవరం: నియోజకవర్గంలోని యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు నియోజకవర్గ స్థాయిలో క్రికెట్ టోర్నమెంట్, వాలీబాల్ పోటీలు, స్త్రీ, పురుషులకు వేర్వేరుగా కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్టు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్ చెప్పారు. ఈ నెల 21 ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ జన్మదినం సందర్భంగా పలు పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దీనిలో భాగంగా మండలాల వారీగా క్రికెట్ పోటీలను నిర్వహించి విజేతలుగా నిలిచిన జట్లను నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. రావలమ్మపాలెం పెద్ద చెరువులో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం అజయ్‌రాజ్ చేతులమీదగా ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము,అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, మాజీ ఎంపీపీ సబ్బవరపు ముత్యాలనాయుడు, బోకం రామునాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు, పార్టీ సీనియర్ నాయకులు బలిరెడ్డి కనకరాజు,బోను గంగునాయుడు, యడ్ల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని వినతి



డిప్యూటీ ఈవో సుజాతకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనుబాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని దేవస్థానం ట్రస్టుబోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు కోరారు. ఈమేరకు బుధవారం దేవస్థానం డిప్యూటీ ఈవో సుజాతను కలిసి వినతిపత్రం అందజేశారు. పనుల్లో జాప్యం జరగడం వల్ల అంచనా వ్యయం పెరుగుతోందని వివరించారు. సీఆర్పీఎఫ్ ఆధీనంలో ఉన్న నగరంలోని ప్రహ్లాద కల్యాణమండపాన్ని దేవస్థానం తిరిగి స్వాధీనం చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఆనందపురం జాతీయ రహదారిలో భక్తులందరికీ సింహాచలం వెళ్లే మార్గం పక్కాగా తెలిసేందుకు శొంఠ్యాం కూడలిలో దేవస్థానం ముఖద్వారం ఏర్పాటు చేయాలన్నారు. అడవివరం గ్రామదేవత ఆలయంతో పాటు భైరవవాకలోని భైరవస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.